



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

రైతులకు ఆదాయం కల్పించేలా ప్రణాళికలు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రైతులకు అదనపు ఆదాయం కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోనే మినీ కన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ అనుబంధ రంగాలు, డ్వామా, గ్రౌండ్ వాటర్, మార్కెటింగ్ తదితర శాఖల అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, ఉద్యానవన శాఖల్లో సాంకేతికత, ఇతర పద్ధతులను ఉపయోగించి పంటలను పండించే ఐదుగురు రైతులను గుర్తించాలన్నారు. పంటల సాగులో సాంకేతికతను ప్రోత్సహించేలా రైతులకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మండలాల వారీగా అధికారులు పరిశీలన చేసి పంటలను గుర్తించాలన్నారు. ఉద్యానవన పంటల్లో డ్రోన్, ఎఐ టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహించడానికి 32 మండలాల్లోని 32 మంది రైతులను గుర్తించాలని సూచించారు. పెనుకొండ ప్రాంతంలో గొర్రెలు, మేక మాంసం ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జూన్ 5న మొక్కలు నాటడానికి పర్యావరణ దినోత్సవ ప్రణాళిక చేపట్టాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, ఏపీఎంఐపి పీడీ సుదర్శన్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, మత్స్యశాఖ ఏడీ చంద్రశేఖర్ రెడ్డి, ఎల్‌డిఎం.రమణ కుమార్, పశు సంవర్ధక శాఖ జెడి శుభ దాస్, పట్టు పరిశ్రమ శాఖ జెడి పద్మావతి, మార్కెటింగ్ శాఖ, నరసింహమూర్తి, గ్రౌండ్ వాటర్ అధికారి మల్లికార్జున రావు పాల్గొన్నారు.

ఉషశ్రీచరణ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, గిరిజమ్మపై కేసు

ప్రజాశక్తి-పెనుకొండ

రామగిరి ఎంపిపి ఎన్నిక నేపథ్యంలో పెనుకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద వైసిపి నాయకులు, పోలీసుల మధ్య జరిగిన ఘటనలో 25 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. పెనుకొండ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆరుగురు ఎంపిటిసిలను తహశీల్దార్ శ్రీధర్ ముందు హాజరు పరిచిన సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వారి అనుచరులు పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దుర్భాషలాడి భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. దీంతో మొత్తం 25 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పండుగపూట ధరలమ(వ)ంట

ఉగాది.. రంజాన్ పండుగలు ఒక రోజు వ్యవధిలో ఈ ఏడాది వచ్చాయి. హిందూవులు, ముస్లిములు చేసుకునే ముఖ్య పండుగలు ఇవి. పండుగ సమయం కావడంతో ప్రతి ఒక్కరూ పిండివంటలను చేసుకుని కుటుంబంతో సంతోషంగా గడపాలనుకుంటారు. పెరిగిన నిత్యావసర ధరలతో పండుగ పూట సామాన్యుడి ఇంట్లో ధరల మంట మండుతోంది. ధరాభారాలతో పోటీ పడలేక ఉన్నవాటితోనే సర్దుకుని పండుగలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- ◆ ఆకాశాన్ని తాకుతున్న నిత్యావసర ధరలు
- ◆ భయపడుతున్న సామాన్యులు
- ◆ పండుగ పూటా పిండివంటలు చేసుకోలేని పరిస్థితి

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉగాది పండుగను ఎంతో వైభవంగా చేసుకుంటారు. ఉగాది పచ్చడితో పండుగను ప్రారంభించుకొని పిండి వంటలు ప్రత్యేకంగా చేసుకుంటారు. ఇక రంజాన్ పండుగకు ముస్లిం సోదరులు మాంసంతో పాటు షీర్ కుర్మా (పాయసం) చేసుకుంటారు. ధరలు పెరగడంతో పండుగ అంటేనే సామాన్యుడు భయపడుతున్నాడు. హిందూపురం పట్టణంలో కిలో సెనగ బ్యాళ్లు రూ.130 నుంచి 160, బెల్లం రూ 80, మైదా రూ.45, 100 గ్రాముల నెయ్యి పాకెట్ రూ.80, చక్కెర కిలో రూ.45 పలుకుతున్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంట్లో పిండి వంటలు చేసుకునేందుకు కనీసం రూ.500 వెచ్చించాల్సి వస్తుంది. మరోవైపు మటన్ కిలో రూ. 800 నుంచి రూ.900 వరకు పలుకుతుంది. చికెన్ కూడా కిలో రూ.150 నుంచి రూ.200 వరకు ఉంది. ఈ ధరలను చూసిన సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఇంత ధరలు పెట్టి పిండివంటలు చేసుకోలేక పండుగ పూట కూడా సాధారణ భోజనంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

కాగుతున్న వంట నూనెలు

వంట నూనెలు సలసలా కాగుతున్నాయి. లీటరు పాకెట్ పై రూ.20 నుంచి 30 వరకు ఒక్కసారిగా ధరలు పెరిగాయి. సన్ ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు గత వారం వరకు రూ.1750 ఉండగా తాజాగా అది రూ.2 వేలకు పైగా చేరింది. లీటరు పాకెట్ ధర రూ. 110 నుంచి రూ.140 పెరిగింది. ఒక లీటరుకు సుమారు 30 రూపాయలకు పైగా ధరలు పెరిగాయి. 15 లీటర్ల పామాయిల్ నూనె డబ్బా ధర వారం క్రితం వరకు రూ.1530 ఉండగా ఇప్పుడు రూ.1750 దాటింది. లీటర్ పామాయిల్ ధర రూ.95 ఉండగా తాజాగా రూ. 130 కి చేరింది. పూజలకు వినియోగించి వివిధ రకాల నూనెల ధరలు సైతం అమాంతంగా పెంచేశారు. గత వారం లీటరు పూజకు వినియోగించే నూనె రూ.90 ఉండగా ప్రస్తుతం రూ.125 నుంచి రూ.140కి చేరింది.

చౌక దుకాణాల్లో ఇవ్వని కందిపప్పు జాడ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ చౌక దుకాణాల్లో కందిపప్పు జాడ కనిపించడం లేదు. ప్రతి నెలా రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ బియ్యంతో పాటు కంది పప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. 3 నెలలుగా కందిపప్పు కేటాయించడం లేదు. ఒక్కో కార్డు కిలో కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. ఈ లెక్కన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న చౌక దుకాణాలకు సుమారు 1200 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా చౌక దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో కందిపప్పు సరఫరా జరగడం లేదు. జనవరి నెలలో తూతూ కొన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేశారు. మార్చి నెలలో అయితే కందిపప్పు కేటాయింపులు చేయలేదు.

ధరలను నియంత్రించాలి

పెరిగిన ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గతంలో టిడిపి ప్రభుత్వం ఇదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రంజాన్, ఇతర పండుగలతోఫా ఇచ్చేవారు. ఇప్పుడూ వాటిని ఇవ్వాలి. ప్రభుత్వం సహాయం చేయకపోవడం ఇటు ధరలు విపరీతంగా పెరగడంతో పండుగ పూట వస్తువులు ఉండాల్సిన పరిస్థితి ఉంది.


జ్యోతమ్మ,
సిపిఎం కాలనీ.

ఉన్నంతలో సర్దుకుంటున్నాం

పెరిగిన ధరలతో సామాన్యులు రంజాన్ పండుగను చేసుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసరాలు, నూనెలు, కొత్త బట్టల ధరలన్నీ పెరిగాయి. పెరిగిన ధరలతో మధ్యతరగతి కుటుంబాల వారికి కష్టాలు తప్పడం లేదు. పెరిగిన ధరలతో ఏమీ కొనలేక ఉన్నంతలో సర్దుకుని పండుగను చేసుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

షబానా బాను,
ధర్మపురం హిందూపురం.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎంలను పరిశీలన చేస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, వివిప్యాట్‌లను కలెక్టర్ టిఎస్.చేతన్ తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోడౌన్‌ను తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవీఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ధర్మవరం ఆర్డీవో మహేష్, తహశీల్దార్ నటరాజ్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు : కలెక్టర్

జిల్లా ప్రజలకు తెలుగు నూతన సంవత్సరాది ఉగాది, రంజాన్ పండుగ శుభాకాంక్షలను కలెక్టర్ టిఎస్.చేతన్ తెలియజేశారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిలో ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది వర్షాలు బాగా వచ్చి పంటలు పండి ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు. ఇక పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ముస్లిములకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. రంజాన్ పండుగను ముస్లిములు సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఇన్విజిలేటర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్




డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

పదో తరగతి ఇన్విజిలేషన్ విధుల్లో సస్పెండైన ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తి వేసి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక యుటిఎఫ్ నాయకులతో కలిసి పట్టణంలోనీ ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డిఇఒ జి.క్రిష్టప్పకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కదిరిలో ఇద్దరు, ముదిగుబ్బలో ఓ ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారని, వారి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు రామకృష్ణనాయక్, సకల చంద్రశేఖర్, లక్ష్మయ్య, అమర్ నారాయణరెడ్డి, బిల్లే రామాంజనేయులు, ఆదిశేషు, వెంకట కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



చైతన్యలో పండుగ వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం



పండుగ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

పట్టణంలోని చైతన్య పాఠశాలలో శనివారం మందస్తు ఉగాది, రంజాన్ పండుగలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయా సాంప్రదాయ దుస్తులతో ఉత్సహంగా హాజరైనారు. ఈ సందర్భంగా పాఠశాల ఎఒ ప్రభాకర్ రెడ్డి పండుగల విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ నాగరాజు, ప్రైమరీ ఇన్‌ఛార్జి కాత్యాయిని, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి నవతా, శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై నిర్లక్ష్యం వద్దు



సమస్యలపై నిలదీస్తున్న కౌన్సిపల్ ప్రతి పక్ష నేత ఆసీఫ్ వుల్లా

మున్సిపల్ రిజర్వు స్థలాల కబ్జాపై స్పందిచండి
అధికారులకు సూచించిన కౌన్సిల్ సభ్యులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో నెలకొన్న నీటి ఎద్దడిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని పలువురు కౌన్సిలర్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్ అధ్యక్షతన పురపాలక సంఘం అత్యవసర సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు 11 అంశాలతో కూడిన అజెండాతో పాటు మరో 5 అంశాలతో కూడిన టేబుల్ అజెండాను కౌన్సిల్ సభ్యుల దష్టికి తీసుకువచ్చారు. మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పురపాలక సంఘం అభివద్ధిపై సాధన నివేదికను వివరించారు. పట్టణంలో పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి మున్సిపాల్టీ తీసుకున్న చర్యలను ఛైర్మన్ తెలియజేశారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలను పూర్తి స్థాయిలో చేసి రాష్ట్రంలోని హిందూపురం పురపాలక సంఘం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కౌన్సిల్ ప్రతిపక్ష నేత ఆసీఫ్ వుల్లా, కౌన్సిలర్ ఇర్షాద్, రోషన్‌లు నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. దీనిపై స్పందించిన మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు మాట్లాడుతూ నీటి సరఫరా మోటార్లు మరమ్మతుకు గురి కావడంతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. మోటార్ల మరమ్మతులు చేయించామన్నారు. పట్టణ శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సుంకం వసూలుకు అనుమతులు పొందిన వారు పురపాలక సంఘానికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించడం లేదని వారిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ నాగేంద్ర బాబు కోరారు. ఇప్పటికే అందరిపై కోర్టులో కేసులను వేశామని కమిషనర్ తెలిపారు. కౌన్సిలర్ మహాలక్ష్మి ముదిరెడ్డిపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కౌన్సిలర్ షాజియా రహమత్ పురంలో మురుగు కాలువలు అక్కడక్కడ పగిలిపోయాయని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కమిషనర్, ఛైర్మన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ రిజర్వు స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ శివ కోరారు. మున్సిపల్ వాణిజ్య సముదాయ భవనంకు నాలుగు వైపుల రోడ్లు ఏర్పాటు చేయాలని, తోపుడు బండ్ల వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువ ఉంది వీటిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ రాఘవేంద్ర కోరారు. పట్టణంలో ఏప రోడ్డు ఎంత విస్తరిస్తున్నారు అన్న విషయాలను బహిర్గతం చేయాలని పలువురు కౌన్సిలర్లు కోరారు. దీనిపై స్పందించిన మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ రైల్వే రోడ్డుతో పాటు పట్టణంలో ప్రధాన రోడ్లన్నీ మాస్టర్ ప్లాన్ మేరకు విస్తరణ చర్యలు చేపడతామని ఛైర్మన్ సమాధానం ఇచ్చారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పన, నీటి సరఫరా పైప్ లైన్ తదితర వాటికి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపామని ఛైర్మన్ తెలిపారు.

ప్రతి పౌరుడికి హక్కులు : ఎస్పీ

ప్రజాశక్తి-హిందూపురం



పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్‌పి వి.రత్న

ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం పలు రకాల హక్కులు కల్పించిందని, ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై తమ హక్కులను పరిరక్షించుకోవాలని జిల్లా ఎస్పీ వి.రత్న సూచించారు. శనివారం హిందూపురం పట్టణ పరిధిలోని కొట్నూరు ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దేశంలో ప్రతి పౌరునికీ రాజ్యాంగం హక్కులు కల్పించిందన్నారు. వీటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కెవి.మహేష్, సిఐ జనార్ధన్, ఎస్ఐలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉగాది, రంజాన్‌ను జరుపుకుందాం

హిందూ, ముస్లిం సోదర భావానికి, మతసామరస్యానికి, శ్రీ సత్య సాయి జిల్లా ప్రతీక అని, అందుకే ఉగాది రంజాన్ పండుగలను ప్రశాంత వాతావరణంలో భక్తి భావంతో జరుపుకోవాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ప్రజలకు సూచించారు. శనివారం ఎస్పీ జిల్లాలోని హిందూ ముస్లిం సోదరులకు ఉగాది ,రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం హిందూపురం పట్టణంలో ప్రార్థన మందిరాలను పరిశీలించి, బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వన్ టౌన్ స్టేషన్‌లో ముస్లీం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. పండుగను .శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట పెనుగొండ, హిందూపురం డీఎస్పీలు వెంకటేశ్వర్లు, కెవి మహేష్, సీఐ జనార్ధన్ సిబ్బంది, మత పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

మానవ సంబంధాలు మెరుగుపడాలి : జిల్లా జడ్జి

ప్రజాశక్తి-హిందూపురం

కనుమరుగవుతున్న మానవ సంబంధాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పేర్కొన్నారు. దిగజారిపోతున్న మానవ సంబంధాల కారణంగా అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం లేపాక్షి మండల పరిధిలోని కుర్లపల్లి, శిరివరం గ్రామాల్లో ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో తహశీల్దార్ సౌజన్య లక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో న్యాయమూర్తి మాట్లాడుతూ ఆడపిల్లల భద్రత పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారుల దష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునేందుకు కషి చేయాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరం అన్నారు. అనంతరం సిరివరం కోదండ రామాలయంలో న్యాయమూర్తి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహమూర్తి, సహాయ ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఐ నరేంద్ర, న్యాయవాదులు మురళి, రవిచంద్ర, ఈశ్వరప్ప, లోక్ అదాలత్ సిబ్బంది శారద పాల్గొన్నారు.



పోలీసులను దుర్భాషలాడడం సిగ్గుమాలిన చర్య

మాజీ ఎమ్మెల్యే త్వరలోనే జైలుకెళ్లడం ఖాయం - టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప

ప్రజాశక్తి-పెనుకొండ

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పోలీసులను దుర్భాష లాడడం సిగ్గుమాలిన చర్య అని టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప పేర్కొన్నారు. ఆయన త్వరలోనే జైలుకెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ రామగిరి ఎంపిపి ఎన్నిక నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సభ్య సమాజం తలగించుకునేలా వ్యవహరించారని ధ్వజమెత్తారు. ఎంపిపి ఎన్నిక సమయంలో ఏ పార్టీ సభ్యులైనా వారి ఇష్టపూర్వకంగా వ్యవహరించే హక్కు వారికి ఉంటుంద న్నారు. ప్రకాష్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా కవ్వింపు చర్యలకు పాల్పడగా, టిడిపి నాయకులు చాలా సంయమనంతో పోలీసులు అప్రమత్తతో వ్యవహరించా రన్నారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారని, పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని ధ్వజమెత్తారు. మీ రెవెన్యూ డివిజన్‌కు సంబంధం లేని పెనుకొండకు వచ్చి మీ జిల్లా అధ్యక్షురాలితో కలిసి నాటకాలు ఆడటం, పోలీసుల మీదకు రౌడీలా వెళ్తూ బూతులు తిట్టడం ఏంటని ప్రశ్నించారు. నీవు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అవినీతి అక్రమాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయని తెలిపారు. గృహ నిర్మాణాల్లో చేసిన అంతులేని అవినీతి అక్రమాలు వెలుగు చూస్తున్నాయని, త్వరలోనే జైలుకు వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు.

మైనార్టీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

మైనార్టీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాల యంలో శనివారం ఎస్‌ఆర్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1500 పేద ముస్లిం మైనార్టీలకు మంత్రి రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ 2014-19లో టిడిపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫా అందించిందని, అనంతరం అధికారం చేపట్టిన జగన్ రంజాన్ తోఫా ఇవ్వకుండా ముస్లింలను దగా చేశారని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏటా పేద ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫా అందించామని, అదే ఆనవాయితీ కొనసాగిస్తూ నేడు రంజాన్ తోఫా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు దాదు, షౌకత్, నూరుల్లా, టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, నాయకులు నారాయణస్వామి, వెంకట రాముడు, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, కేశవయ్య, రమణమ్మ, చంద్రకాంతమ్మ, లక్ష్మీదేవి, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న తాడిపత్రి కమిషనర్

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ ప్రఖ్యాత 100వ స్కోచ్ అవార్డుల వేడుకలో వెండి అవార్డును అందుకున్నారు. తాడిపత్రి మున్సిపాలిటీలో ప్రభుత్వ వ్యవస్థ, ప్రజాసేవల్లో చేసిన అసాధారణ కృషిని గుర్తించి ఆయనకు ఈ అవార్డును న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. సాలిడ్ వ్యర్థ సేకరణ, నాశన పద్ధతుల విభాగంలో ఈ అవార్డును కమిషనర్ తీసుకున్నారు. తాడిపత్రి మున్సిపాల్టీ స్థిరమైన వ్యర్థ నిర్వహణ, పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ రంగంలో చేసిన సేవలకు ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శివ రామకృష్ణ మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, తాడిపత్రి కౌన్సిలర్లు, పారిశుధ్య కార్మికుల కృషి, ప్రజల సహకారంతో అవార్డు దక్కిందన్నారు.

వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి కౌన్సిలర్లు సుభద్ర నాగేంద్ర, విక్రం టైలర్, ఆర్ఎస్ ప్రియాంక ఈశ్వర్‌తో పాటు 200 కుటుంబాలు శనివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే టిడిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన కౌన్సిలర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో సిఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి టిడిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, కౌన్సిలర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.


టిడిపిలో చేరిన కౌన్సిలర్లకు కండువా వేస్తున్న ఎమ్మెల్యే

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే

ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఐసిడిఎస్ సిడిపిఒ నాగమల్లేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎమ్మెస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో మరింత ముందుకు పోవడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, పాండురంగప్ప, మార్కెట్ యార్డ్ నూతన ఛైర్మన్ గురుమూర్తి, కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, అంగనవాడి టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కుల అందజేత

గుడిబండ : మండల వ్యాప్తంగా వన్యప్రాణుల నుంచి నష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరైన పరిహారం చెక్కులను శనివారం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కుళ్లాయప్ప బాధితులకు అందజేశారు. పూజారిపల్లి గ్రామానికి చెందిన భూతరాజుకు రూ. 6 వేలు, సి.కొడిగేపల్లి కృష్ణప్పకు రూ. 19,500, కొంకల్లు గ్రామానికి చెందిన లక్ష్మమ్మకు రూ. 12 వేలు, మహాలింగప్పకు రూ. 24 వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వైల్డ్ లైఫ్ వాచర్లు షౌకత్ అలీ, భీమప్ప పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం

మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలతో పాటు మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం పురపాలక సంఘ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు అధికారులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులతో కలిసి ఛైర్మన్ ప్రారంభించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జనార్ధన్, శంకర్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, మహాలక్ష్మి, భారతి, అంజలి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్

సర్వే శిక్షణ కార్యక్రమం ప్రారంభం

పట్టణంలోని ముక్కడిపేట నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ శిక్షణ కేంద్రంలో ఎపి నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న అసిస్టెంట్ సర్వే శిక్షణ కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ ఛైర్మన్ డిఇ.రమేష్ కుమార్ ప్రారంభించారు. నిరుద్యోగులు శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఇర్షాద్, సతీష్, నాక్ శిక్షణ కేంద్రం ఇన్‌ఛార్జి ఆనంద్. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్, శిక్షకులు విల్సన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నలుగురు కార్మికులకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న నలుగురు కార్మికులకు ఉద్యోగోన్నతులు కల్పిస్తూ శనివారం మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులతో కలిసి ఛైర్మన్ రమేష్ కుమార్ తన ఛాంబర్ ఉత్తర్వులను అందించారు. 4 అటెండర్ పోస్టులను ఉద్యోగోన్నతుల పద్ధతిలో భర్తీ చేయడానికి దరఖాస్తులను ఆహ్వానించగా ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న వారిలో విద్యార్హత, అనుభవం ఉన్నవారిలో రామలక్ష్మి, చంద్రశేఖర్, రవి కుమార్, సుగుణలకు ఉద్యోగోన్నతులను కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సతీష్ కుమార్, మహాలక్ష్మి, భారతి, దుర్గా మంజుళ పాల్గొన్నారు.


ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందిస్తున్న కమిషనర్

పరమటి వీరన్నకు భారీగా తరలిన పన్నేరపు బండ్లు

ప్రజాశక్తి-బత్తలపల్లి

మూగజీవాల పట్ల కరుణచూపే ఆరాధ్యదైవం పరమటి వీరన్న దర్శనార్థం ఉగాది పండుగ సందర్భంగా మండలం నుంచి భారీగా పశువులు, పన్నేరపు బండ్లు తరలివెళ్లాయి. తాడిమర్రి మండలంలోని ఆత్మకూరు గ్రామ సమీపంలో వెలసిన పరమటి వీరన్నకు మొక్కుకుంటే పశువులకు కీడు జరగదన్నది ప్రజల విశ్వాసం. దీనిని పాటించే రైతులు తమ ఆవులు, గేదేలు ప్రసవించిన మొదటి రోజున పాలను ఆయనకు' సమర్పించడం ఆనవాయితీ. ఉగాది పండుగ ముందు రోజు మండలం నుంచే కాకుండా ముదిగుబ్బ, తాడిమర్రి, ధర్మవరం, అనంతపురం మండలాల నుంచి పెద్దఎత్తున రైతులు పన్నేరపు బండ్లు, పశువులు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకొని, మరికొందరు వాహనాల్లో తరలివెళ్లారు. ప్రతి ఇంటి నుంచి భక్తులు బియ్యం, బేడలు, బెల్లం సమర్పించుకుంటారు. వీటితో ఉగాది పండుగ అనంతరం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అన్నదానం చేస్తారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కదిరిటౌన్

విద్యార్థులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ ఎస్.జయలక్ష్మి సూచించారు. గాండ్లపెంట మండలంలోని కటారుపల్లి కెజిబివిలో శనివారం ప్రిన్సిపల్ దుర్గ అధ్యక్షతన నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విషయంలో ముందు జాగ్రత్తతో వ్యవహరిస్తే మంచి పరిణామాలు ఉంటాయన్నారు. పోక్సో, ఇతర చట్టాలపై అవగాహన కోసం చిన్న చిన్న కథలు, వేమన పద్యాలను చెప్పి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చౌడప్ప, న్యాయవాది నరసింహులు, రూరల్ సిఐ నాగేంద్ర, ఎస్ఐ వలిబాషా, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జయలక్ష్మి



వెండి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఉగాది సందర్భంగా మండలంలోని కనుమలో వెలిసిన శ్రీ భూనీల లక్ష్మీనరసింహస్వామికి ప్రభుత్వ వైద్యులు రామకృష్ణ శనివారం వెండి ఆభరణాలు అందజేశారు. రూ. 5 వేల విలువ చేసే వెండి ఆభరణాలను ఆలయ అర్చకులకు అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి రామకృష్ణకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పౌరులు ప్రాథమిక హక్కులు పొందాలి


ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని పోతులనాగేపల్లి గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. తహశీల్దార్ నటరాజ్, ఎంపిడిఒ కార్యాలయ ఏఓ అబ్దుల్ నబి మాట్లాడుతూ ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన సేవలను పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో పోతుల నాగేపల్లి గ్రామ ప్రజలు, పంచాయతీ కార్యదర్శి మురళి,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పౌరహక్కుల సభలో పాల్గొన్న రెవెన్యూ అధికారులు

ముదిగుబ్బ : మండలంలోని పూజారితండా గ్రామంలో సిఐ శ్యామరావు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్నం పోలీస్ సిబ్బంది, గిరిజనులు పాల్గొన్నారు.


మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎంపి పార్థసారధి

మృతుని కుటుంబానికి ఎంపి పరామర్శ

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని చోలేమర్రి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త సుబ్బరాయప్ప భార్య లక్ష్మమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకొన్న ఎంపి బికె.పార్థసారథి ఆ గ్రామం వెళ్లి లక్ష్మమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామంలో మాజీ సర్పంచి జయ రామప్ప ఇటీవల మృతిచెందినట్లు తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నాయకులు చిన్నప్పయ్య, చోలేమర్రి సర్పంచి జనార్ధన, మారెప్ప, ఈడిగ శ్రీనివాసులు, హరీష్ ఉన్నారు.

మైనాస్వామికి ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని కరావులపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ చారిత్రక, పురావస్తు పరిశో ధకుడు, రచయిత మైనాస్వామిని రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారంతో సత్కరించనుంది.



ఉగాది సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులకు రాష్ట్ర ప్రభుత్వం 'కళారత్న', హంస పతకం, ప్రశంసాపత్రం, నగదు పురస్కారం అందిస్తుంది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగే ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో సిఎం చంద్రబాబు నుంచి మైనాస్వామి ఈ పురస్కారం అందుకోనున్నారు.

ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి-నల్లమాడ

ప్రజా సమస్యలపై శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డికి సిపిఎం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సిపిఎం మండల నాయకుడు గోవిందు మాట్లాడుతూ తాగునీరు, రోడ్లు, డ్రైయిజీలు, పేదలకు ఇళ్ల స్థలాల సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు.



తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

యు.రంగాపురంలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని యు.రంగాపురం గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రమైంది. గ్రామ అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరులో పూర్తిస్థాయిలో నీరు రాకపోవడంతో గ్రామంలో అరకొరగా నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మురుగునీటి సమస్య పరిష్కారం

సోమందేపల్లి : స్థానిక బాలాజీనగర్‌లో మురుగు నీరు నిలిచిన ప్రాంతాన్ని శనివారం టిడిపి నాయకులు నీరగంటి చంద్ర, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి ఆధ్వర్యంలో జెసిబితో శుభ్రం చేయించి మట్టిని తోలి గుంతలు పూడ్చారు. అనంతరం డిఎల్‌పిఒ శివ నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనే యులు, సచివాలయ సిబ్బంది కాలనీలో పర్యటించి ప్రతి ఇంటికీ తప్పనిసరిగా ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని ఇంటింటికీ నోటీసులు అందిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, రంగా, సచివాలయ కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు

లేపాక్షి : మండలంలోని సిరివరం, కుర్లపల్లి గ్రామాల్లో శనివారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా హిందూపురం అడిషనల్ జడ్జి శైలజ హాజరై మాట్లాడారు. మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడమే సదస్సుల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించినప్పుడే సమాజం బాగుటుందన్నారు. పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర, ఎంపీడీఓ నరసింహామూర్తి, వైద్యులు చిరంజీవి, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్వాడీ వర్కర్ల శిక్షణ

కదిరి టౌన్ : పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో అంగన్వాడీ వర్కర్లకు ఏర్పాటు చేసిన రెండో విడత శిక్షణ శనివారం ముగిసింది. సిడిపిఒ రాధిక మాట్లాడుతూ చిన్నారులకు విద్యా బుద్ధులు నేర్పడం, మేధాశక్తి పెంపొందించడం, మెలకువలు, దివ్యాంగ పిల్లలను గుర్తించడం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామ న్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు నిహారిక, దీప, మమత, అలివేలమ్మ పాల్గొన్నారు.


శిక్షణకు హాజరైన అంగన్వాడీ కార్యకర్తలు

స్థానిక సంస్థల వేడి..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఒకవైపు వాతావరణ వేడితోపాటు స్థానిక సంస్థల ఉప ఎన్నికల వేడి జిల్లా రాజకీయ వాతావరణాన్ని వేడి చేశాయి. ప్రధానంగా మండల పరిషత్ అధ్యక్ష ఎన్నికలు వైసిపి, టిడిపిల మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకునేలా చేసింది. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో ఖాళీగా ఉన్న మండల పరిషత్‌ల అధ్యక్ష, ఉపాధ్యక్ష పోస్టులు భర్తీకి ఉప ఎన్నికలు జరిగాయి. అన్నింటిలోనూ వైసిపికి పూర్తి స్థాయి మెజార్టీ ఉండింది. దీంతో అనంతపురం జిల్లాలో ఎక్కడా పెద్దగా మార్పుల్లేకుండానే ఏకగ్రీవంగా ఆ ఎన్నికలు పూర్తయ్యాయి. అయితే రామగిరి, గాండ్లపెంట ఎన్నికలు మాత్రం పెద్ద ఎత్తున ఘర్షణ వాతావరణం నడుమ వాయిదాలు పడ్డాయి. ప్రధానంగా రామగిరి సాధారణ ఎన్నికలను తలపించే విధంగా టిడిపి, వైసిపిల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రెండు పార్టీల నాయకులు ఇరు వైపులా యుద్ధానికి తలపడినట్టుగా తలపడ్డారు. ఈ నేపథ్యంలో 144 సెక్షన్ విధించి మరీ ఎన్నికలు నిర్వహించాలని అధికారులు చూశారు. అధికార పార్టీ ఒత్తిడి నేపథ్యంలో వైసిపి ఎన్నికలనే బహిష్కరించింది. దీంతో రామగిరి మండల పరిషత్ ఎన్నిక జరగలేదు. అదే పద్ధతిలో గాండ్లపెంట ఎన్నికలు జరగకుండా వాయిదా పడ్డాయి. ఇప్పుడు అక్కడ ఏమి చేస్తారన్న దానిపై చర్చ నడుస్తోంది. ఇంకో వైపు టిడిపి ఎమ్మెల్యే పరిటాల సునీత, వైసిపి మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

అనంతపురం నగరపాలక సంస్థలో పాలకవర్గంలో అసంతృప్తులు మేయర్‌ను పదవి నుంచి దించే వరకు పావులు కదిలాయి. వైసిపిలోని కొంత మంది అధికార టిడిపితో కలసి ఈ పావులు కదిపే ప్రయత్నం చేశారు. సరైన సమయంలో వైసిపి ముఖ్య నాయకులు మేలుకుని సరిచేయడంతో వైసిపి పదవిని నిలబెట్టుకుంది. ఇక రాయదుర్గం పురపాలక సంఘంలో మాత్రం వైసిపిలోనే ఘర్షణ చోటు చేసుకుంది. ఇది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఇక్కడ వైసిపి గ్రూపు రాజకీయాలతో రాయదుర్గం రాజకీయం వేడెక్కింది. ఇక తాడిపత్రిలో మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి మైనార్టీ నాయకుడు ఫయాజ్ బాషా, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భవనాలకు సంబంధించి చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. దీనికి ప్రతిగా వైసిపి నాయకులు ఫయాజ్ బాషా కూడా ప్రభాకర్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. ఇదే సమయంలో జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తదితరులు కలిసి శనివారం నాడు జిల్లా ఎస్పీకి ప్రభాకర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఏ రకమైన చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.



వలస కార్మికులకు వేతనాల చెల్లింపు

ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపిన కార్మికులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడ ఓస్వల్ స్మెల్టర్స్ స్టీలు పరిశ్రమలో వలస కార్మికులకు పరిశ్రమ యాజమాన్యం వేతనాలను చెల్లించింది. వివిధ రాష్ట్రాల నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన కార్మికులను గుత్తేదారుడు వదిలేసి వెళ్లిపోయాడు. 28 మంది కార్మికులకు యాజమాన్యం ఇవ్వాల్సిన వేతనాలు రూ.7,26,617 చెల్లించకుండా రోడ్డున పడేసింది. ఈ విషయంపై ఈనెల 12వ తేదీన ప్రజాశక్తి వలస కార్మికులు పడుతున్న బాధలను వివరిస్తూ 'దగాపడ్డ వలస కార్మికులు' అనే శీర్షికతో ప్రత్యేక కథనాన్ని తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ పరిశ్రమను తనిఖీ చేసి, కార్మికులకు వేతనాలను చెల్లించాలని ఆదేశించారు. అధికారి ఆదేశాల మేరకు కార్మికుల వేతనాలను శనివారం మంజూరు చేశారు. వేతనాలు మంజూరు చేసేందుకు కృషి చేసిన ప్రజాశక్తికి కార్మికులు, పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.


హర్షం వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘం అధ్యక్షులు, కార్మికులు

మూల్యాంకనం విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి

ప్రజాశక్తి- కొత్తచెరువు

అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయులు, వయసు రీత్యా పెద్దవారు, వికలాంగులు, చంటి పిల్లల తల్లులకు పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ శనివారం ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డిఇఒ జి.కృష్టప్పకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ స్పాట్ వాల్యూషన్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇటీవల సస్పెండ్ అయిన ఇన్విలేటర్లను విధుల్లోకి తీసుకోవాలని, తదితర సమస్యలను పరిష్కరించా లని కోరారు. ఆయన వెంట ఎస్‌టియు మండల అధ్యక్షులు శివయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.


డిఇఒ క్రిష్టప్పకు వినతి ఇస్తున్న ఎస్‌టియు నాయకులు

'విద్యుత్ షాకులు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-పెనుకొండ

సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన 'విద్యుత్ షాక్‌లు' పుస్తకాన్ని శనివారం పట్టణంలో సిపిఎం నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు, స్మార్ట్ మీటర్ల ఉపసంహరణ, సెకి ఒప్పందం రద్దు, టైమ్ ఆఫ్ డే విధానం రద్దు' అంశాలపై పుస్తకంలో వివరించారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరి, బాబావలి, తిప్పన్న మహబూబ్ బాషా, గంగాధర్, వెంకట్రాముడు, సిఐటియు నాయకులు బావమ్మ, నాగరాజు, నరసింహ, సలీం, పాల్గొన్నారు.


'విద్యుత్ షాక్‌లు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సెకి ఒప్పందం రద్దు చేయాలి

పుట్టపర్తి క్రైమ్ : సెకి ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసి ప్రజలపై విద్యుత్ భారాలు తగ్గించాలని సిపిఎం పట్టణ కన్వీనర్ పైపల్లి గంగాధర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జగన్ సర్కారు పోయి బాబు ప్రభుత్వం వచ్చినా ప్రజలకు ఏం ప్రయోజనం లేదన్నారు. విద్యుత్ ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ప్రభుత్వం సెకి ఒప్పందం రద్దు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా కోశాధికారి అంకె ముత్యాలప్ప కోరారు. కొత్తచెరువులో శనివారం భవన నిర్మాణ కార్మికులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం తప్పక నెరవేర్చాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన 1214 జీవోను రద్దు చేయాలని, ముడిసరుకుల ధరలను తక్షణమే తగ్గించాలన్నారు. ఏప్రిల్ 24వ తేదీ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు శ్రీరాములు పాల్గొన్నారు.


భవన నిర్మాణ కార్మికులతో సభ్యత్వ నమోదు చేపట్టిన నాయకులు

బత్తలపల్లిలో ట్రాఫిక్ అస్తవ్యస్తం..

పట్టించుకోని పోలీసులు

ప్రజాశక్తి-బత్తలపల్లి

బత్తలపల్లి కూడలి వివిధ పట్టణాలకు వెళ్లేందుకు ముఖ్యకూడలి. ఇక్కడ తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నా పోలీసులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఆటో డ్రైవర్లు ఇష్టారాజ్యంగా రోడ్డుపై ఆపి ప్రయాణికులను ఎక్కించడం, దించడం వల్ల ట్రాఫిక్ స్తంభించి వాహనాలు పెద్దఎత్తున ఆగిపోతున్నాయి. ముఖ్యంగా రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు నిర్వహి స్తుండడంతో కొనుగోలుదారులు, వాహనదారులతో నిత్యం ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారుతోంది. తాడిపత్రి రోడ్డులో తరచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అక్కడ వాహనాలు ఆగిపోతే మూడు రోడ్లలో వాహనాలు ఆగిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండగా పోలీసులు ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఉత్సాహం చూపడంలేదు. మంత్రులో, ప్రజాప్రతినిధులో, ముఖ్య నాయకులో, ఉన్నతాధికారులో వచ్చినప్పుడు మాత్రం పోలీసులు కూడలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తారు. లేదంటే ఇటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. ఈ క్రమంలో శనివారం బత్తలపల్లి కూడలికి భారీగా జనాలు తరలివచ్చి నిత్యావసర వస్తువులు, పూజ సామగ్రి కొనుగోలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అయినా ఏ ఒక్క పోలీసు అటువైపు రాలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇకనైనా బత్తలపల్లి కూడలిలో ట్రాఫిక్ సమస్యపై పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


బత్తలపల్లి కూడలిలో నిలిచిపోయిన వాహనాలు

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

మండలంలోని బుడ్డయ్యపాలెం గ్రామానికి చెందిన వెంకటేష్ శుక్రవారం సాయంత్రం చీపులేటి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో స్థానిక ప్రభుత్వ సుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లగా అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సంతలో సెల్‌ఫోన్లు చోరీ

ప్రజాశక్తి-రొద్దం

రొద్దంలో శనివారం నిర్వహించిన వారపు సంతలో ఇద్దరు వ్యక్తుల సెల్‌ఫోన్లు చోరీకి గుర య్యాయి. వారిలో ఎం.కొత్తపల్లి సర్పంచి స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా నాలుగు రోజుల క్రితం కొన్న రూ. 18 వేల విలువ చేసే సెల్‌ఫోన్‌ను దొంగలు అపహరించారు. అలాగే పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన మరొక వ్యక్తి నుంచి రూ. 8వేల విలువ చేసే సెల్‌ఫోన్ చోరీకి గురైంది. 6 నెలల వ్యవధిలో వారపు సంతలో 8కి పైగా సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు బాధితులు వాపోతున్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని రాజేంద్రనగర్‌కు చెందిన నరసప్ప కుమారుడు మురళి శనివారం మున్సిపల్ కార్యాలయ సమీపంలో సూపర్ వాస్మోల్ ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్నేహితులు గమనించి మురళిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మురళి లారీ మెకానిక్‌గా పని చేస్తాడు. అతడి ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

టిడిపి కార్యకర్త మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక వడ్డెర కాలనీలో నివసిస్తున్న టిడిపి కార్యకర్త చేపల పెద్దన్న శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టిడిపి యువ నాయకులు తాళ్లూరు సతీష్‌చౌదరి వడ్డెర కాలనీకి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామ ర్శించి రూ. 5వేలు అందజేశారు. ఆయన వెంట వడ్డే బొజ్జప్ప ఉన్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పావగడ

ఉగాది పర్వదినం పురస్కరించుకుని తాలూకాలోని వైఎన్.హోసకోటే హోబలి ఇంద్రబెట్ట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం పంచముఖి ఆంజనేయస్వామి ఆలయ మండలి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోతగానహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మంజుల మంజునాథ్, సభ్యురాలు పార్వతిరవి, ఎస్‌డిఎంసి అధ్యక్షుడు రామచంద్ర, ఆలయ వ్యవస్థాపకులు పిఆర్.మంజునాథ్, హెచ్ఎం హరికృష్ణ పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన దాతలు

యోగివేమన ఆలయం పరిశీలన

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని కటారుపల్లి పంచాయతీలో ఉన్న శ్రీయోగివేమన ఆలయాన్ని శనివారం తహశీల్దార్ బి.బాబురావు, కదిరి రూరల్ సిఐ నాగేంద్ర, ఎస్ఐ నరసింహుడు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఏప్రిల్ 6, 7 తేదీల్లో జరిగే శ్రీయోగివేమన బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఆలయ పరిసరాలను పరిశీలించామన్నారు. ఎక్కడా అపరిశుభ్రత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యుడు నందవేమారెడ్డిని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని తెలిపారు. వారి వెంట రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ జాఫర్, విఆర్ఒ కిష్టప్ప, జమేదారు పి.రామయ్య ఉన్నారు.


పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం




పుట్టపర్తిలో టిడిపి జెండాను ఆవిష్కరించిన పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే సింధూర

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

తెలుగుదేశంపార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ అని ఎంపి బికె.పార్థసారధి పేర్కొన్నారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎంపి పూలమాల వేసి నివాళులర్పించారు. మడకశిర రోడ్డులోని ఎంపి కార్యాల యం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, చౌడప్ప, అంజన్‌రెడ్డి, నాగప్ప, ఉగిరప్ప, రామాంజినరెడ్డి, ఉత్తప్ప, తదితరులను ఘనంగా సత్కరించారు.

టిడిపితోనే బడుగులకు రాజ్యాధికారం : మంత్రి సవిత

పెనుకొండ : కష్టపడే ప్రతి కార్యకర్తకూ టిడిపిలో ప్రాధాన్యం ఉంటుందని మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. పట్టణంలో మంత్రి నేతృత్వంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. పార్టీ కార్యాలయంలో మంత్రి టిడిపి జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ మే నెలాఖరులో జరిగే టిడిపి మహానాడులో పార్టీ కమిటీలతో పాటు అనుబంధ కమిటీల పదవులను కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నామినేటెడ్ పదవులు సైతం భర్తీ చేస్తున్నామన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందజేయాల్సిన బాధ్యత కార్యకర్తలదే అన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ అసమర్థ పాలనతో ప్రజలు విసిగిపోయి, కూటమికి పట్టం కట్టారని తెలిపారు. గాల్లో వచ్చిన పార్టీ గాల్లో కలిసిపోయిందని ఎద్దేవా చేశారు. గత వైసిపి ప్రభుత్వం బనాయించిన తప్పుడు కేసుల నుంచి టిడిపి శ్రేణులకు త్వరలోనే విముక్తి కల్పించడానికి సిఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. నీరు-చెట్టు బిల్లులు సైతం త్వరలో మంజూరు చేస్తామని భరోసానిచ్చారు. అంతకుముందు మంత్రి నేతృత్వం లో పార్టీ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ చేపట్టి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వా సుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, టిడిపి నాయకులు, కార్యాకర్తలు, పాల్గొన్నారు.



ధర్మవరంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

కదిరిటౌన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పూలమాల వేసి నివాళు లర్పించారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపికి కార్యకర్తలే వెన్నెముక అని, పార్టీ కోసం చేసిన ప్రతి కార్యకర్తకు గౌరవం, గుర్తింపు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పివి.పవన్‌కుమార్‌రెడ్డి, కృష్ణమోహన్, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని టిడిపి కార్యాలయం ముందు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే కొండంత బలమన్నారు. ఆసుపత్రి, వృద్ధాశ్రమంలో పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ, గ్రామీణ కన్వీనర్లు రామాంజనే యులు, విజయ్‌కుమార్, బెస్త చలపతి, పిసి.గంగన్న, నాయకులు రత్నప్పచౌదరి, చెన్నకేశవులు, శ్రీరామ్‌రెడ్డి, మహమ్మద్ రఫీ, కడియాల సుధాకర్, బొమ్మయ్య, శ్రీరామ్ నాయక్, పుల్లప్ప, ఓబులేసు, కేశవనాయుడు పాల్గొన్నారు.

కొత్తచెరువు : స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం కల్పించి, ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, లోచర్ల పెద్దన్న, సుధాకర్, రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణం లోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు వందల సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో టిడిపి నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో



పెనుకొండ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

మాల్యవంతం నారాయణస్వామి, మాధవరెడ్డి, బీరే శ్రీనివాసులు, హుస్సేన్, చికెన్ రాము, జైలర్ వెంకటేశులు, ముత్యాలు, రాధాకృష్ణ, శివ, జనార్ధన, విక్రమ్ యాదవ్, శ్రీనివాసులు, చంద్రమౌళి, వీరేష్ పాల్గొన్నారు.

మడకశిర : సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్ అని ఆ పథకాలే నేటికీ దేశంలో అమలవుతున్నాయని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు పేర్కొన్నారు. ముందుగా ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తితో కలిసి పట్టణంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బిసిలకు రాజ్యాధికారం, మహిళలకు ఆస్తిలో సమానహక్కు, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, రూపాయికే కిలో బియ్యం, జనతా వస్త్రాల పంపిణీ, పక్కాఇళ్ల నిర్మాణం, తదితర ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు ఓబులేసు, మాధవరాజు, ఆసుపత్రి కమిటీ మెంబర్ మంజునాథ్, కన్నా, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. టిడిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మలిరెడ్డి, టౌన్ కన్వీనర్ వెంకట రాముడు, నాయకులు సాకే యశోద, గంగాధర్, సుబ్బారెడ్డి, లావణ్యగౌడ్, బాలు, శ్రీరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బత్తలపల్లి : టిడిపి మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల వ్యాప్తంగా గ్రామ గ్రామన టిడిపి జెండా రెపరెపలాడింది. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో జక్కంపూడి నాగభూషణ, నెట్టెం రమణ, పళ్లపోతుల శ్రీరాములు, రామాపురం కేశవ, చిట్రా నాగభూషణ, చిదంబర్‌రెడ్డి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

తలుపుల : మండలంలోని అన్ని గ్రామాల్లో టిడిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో మండల కన్వీనర్ ముబారక్, మూడు రోడ్ల కూడలిలో జయచంద్ర, కుమ్మరి శీను, బాబు, ఎద్దుల రాముడు, బండ్లపల్లి పంచాయతీలో దేరంగుల గంగరాజు, నూతన కాలవలో ఓబుల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డిపల్లిలో జయరామ్, పులిగిల్లపల్లిలో శ్రీశైలంగౌడ్, శ్రీరామ్‌రెడ్డి, ఈదల కుంట్లపల్లిలో దేవేంద్రనాయక్, గంజివారిపల్లిలో అక్బర్‌ముస్తఫా, పెద్దనారుపల్లిలో మేడా శంకర్, భద్రపల్లెలో రాములత, ఉడకములకులో గోపాత్ ఆధ్వర్యంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు.



పెనుకొండలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపి బికె.పార్థసారధి, నాయకులు

నంబులపూలకుంట : నంబులపూలకుంటలో టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని మండల నాయ కులు ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమం లో నాయకులు అంజనప్ప నాయుడు, నరసింహులు, శ్రీరాములు నాయుడు, దండే రవిశంకర్, చమన్, శివారెడ్డి, గంగులప్ప, బిసి నాయకులు రవి, రామిరెడ్డి, ఆదినారాయణ, అజ్మతుల్లా పాల్గొన్నారు.

గోరంట్ల : టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, నాయకులు బాలకృష్ణచౌదరి, నరేష్, ఉత్తమ్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, అజ్మతుల్లా, నిమ్మల శ్రీధర్, అశ్వత్థరెడ్డి పాల్గొన్నారు.

రొద్దం : రొద్దంతో పాటు మండలంలోని పెద్దమంతూరు, నారాయణగేపల్లి, బూచెర్ల, తదితర గ్రామాల్లో టిడిపి శ్రేణులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరహరి, రాము, మనోహర్, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు

ముదిగుబ్బ : స్థానిక బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, నాయకులు తుమ్మల మనోహర్, నరసింహయాదవ్, కోట్ల బాబి, ఆర్వేటి గోపాల్‌రెడ్డి, హేమలత బాయ్, మహబూబ్ పీరా, చికెన్ తిరుపాల్, ఆనంద్, రాజు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు : స్థానిక అంబేద్కర్ కూడలిలో టిడిపి నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, జనసేన నాయకులు కొట్టి కుమార్, ప్రభాకర్‌రెడ్డి, పీజీ మల్లికార్జున, రెడ్డప్పరెడ్డి, చంద్రప్ప, సరోజమ్మ, శోభమ్మ పాల్గొన్నారు.

నల్లచెరువు : టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కదిరిలో ఎన్టీఆర్ విగ్రం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

గాండ్లపెంట : టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య ఆధ్వర్యంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర సెక్రటరీ డి.ఆనంద్, అక్రమ్‌బాషా, నర్సింహులు, పి.కేశవరెడ్డి, సర్పంచి ఎస్.శివప్పనాయుడు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

గుడిబండ : గుడిబండతో సహా మండల వ్యాప్తంగా గ్రామాలోల టిడిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ మద్దనకుంటప్ప ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో శివకుమార్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, ఎంపిటిసి శశిధర్, తదితరులు పాల్గొన్నారు

హిందూపురం : పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో టిడిపి 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజినప్ప, మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్, సీనియర్ నాయకులు ఆర్ఎంఎస్ షఫివుల్లా, అమర్నాథ్, తదితరులు ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి పరిమళ, కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, దుర్గా నవీన్, ప్రియ గంగాధర్, శివ శంకర్ పాల్గొన్నారు.



హిందూపురంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



గోరంట్లలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



బత్తలపల్లిలో..



తలుపులలో..